కిక్ బాక్సింగ్‌లో మెడల్స్



మెడల్స్ సాధించిన రావుల యశశ్రీ

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ న్యూ దుర్గాహిల్స్ ప్రాంతానికి చెందిన రావుల యశశ్రీ రెండు రోజుల క్రితం ఢిల్లీలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్, బ్రౌంజ్ మెడల్స్ సాధించింది. దుర్గానగర్‌లోని ఫ్లైయింగ్ స్టార్ బాడ్మింటన్ అకాడమీలో యశశ్రీ శిక్షణ తీసుకున్నది. యశశ్రీ కర్మన్‌ఘట్‌లోని నాగార్జున స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నది.





మధురానగర్ కాలనీ వద్ద మ్యాన్‌హోళ్ల పరిస్థితి



ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

రాయదుర్గం: పలుచోట్ల మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్ కాలనీ ప్రధానరోడ్డు పక్కన సర్వీస్ రోడ్డుపై మూడుచోట్ల మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. వాటికి మూతలు లేకపోవడంతో ప్రమాదవశాత్తు అందులో పడిపోతే తీవ్రంగా గాయపడే ప్రమాదం లేకపోలేదు. ఈ విషయమై అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా మ్యాన్‌హోళ్లను రోడ్డుకు సమాంతరంగా ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మధురానగర్ నుంచి ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఔటర్ రింగురోడ్డు, సర్వీస్ రోడ్డు, ప్రశాంత్‌హిల్స్, సాయిఐశ్వర్య, సాయివైభవ్, ఖాజాగూడ, ల్యాంకోహిల్స్, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, కేశవనగర్ వంటి ప్రాంతాలకు ఈ రోడ్డుపై నుంచే వస్తుంటారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికితోడు స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా ఉండడంతో అధ్యాపకులు, విద్యార్థులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

గోవా క్యాంప్‌కు మణికొండ కౌన్సిలర్లు

మణికొండ: అవిశ్వాసం తేదీ సమీపిస్తుండడంతో మణికొండ మున్సిపాలిటీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్‌పై 10 మంది కౌన్సిలర్లు గత నెల కలెక్టర్‌కు అవిశ్వాసం లేఖ ఇచ్చినప్పటి నుంచి స్థానికంగా ఉన్న మెజార్టీ కౌన్సిలర్లు గురువారం గోవా బాట పట్టారు. అవిశ్వాసం నెగ్గాలంటే 13 మంది సభ్యుల బలం కావాలి. అయితే 10 మంది కౌన్సిలర్లు సంతకాలతో కలెక్టర్‌కు లేఖ అందించడం, 20వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ కె.లక్ష్మీనాగేశ్వర్‌రావు అనూహ్యంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రేసులోకి రావడంతో వారి బలం 11కు పెరిగింది. ఇక వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఇప్పటి వరకు తటస్థంగా ఉన్నారు. అతను సైతం వారికి మద్దతు పలికినా వారి సంఖ్య 12కు చేరుకోనున్నది. వీరికి మరో సభ్యుడు మద్దతు తెలిపితే తప్ప అవిశ్వాసం నెగ్గే సూచనలు కనిపించడం లేదు. అయితే అవిశ్వాసం పెట్టిన కొందరు కౌన్సిలర్లతో ఈ మధ్య చైర్మన్ నరేందర్ ముదిరాజ్ ఫోన్లు చేసి తన వైపునకు తిప్పుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆ విషయం తెలుసుకున్న 10 మంది వరకు కౌన్సిలరుల స్థానికంగా ఉండకుండా క్యాంప్‌నకు వెళ్లి ఈనెల 22వ తేదీనే నేరుగా వచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలనే నిర్ణయానికి వచ్చి గోవాకు వెళ్లినట్లు సమాచారం. వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ బి.కావ్యాశ్రీరాములు మాత్రం స్థానికంగానే ఉన్నట్లు తెలిసింది.

ఈనెల 19 నుంచి ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ హిదాయతుల్లా

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని మీనా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 24 వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ హిదాయతుల్లా తెలిపారు. రాజేంద్రనగర్ పిల్లర్ నంబర్ 254 వద్ద గల ఆసుపత్రి వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిపుణులైన బృందంతో వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. రోగులు 16, 17, 18వ తేదీల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరంలో పాల్గొనే వారికి కార్డును అందజేస్తామని, దీని ద్వారా రెండేళ్ల పాటు 20 శాతం రాయితీపై వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఖీజర్ రావూఫ్, డాక్టర్ షకీబ్ మహ్మద్, డాక్టర్ సాహిబా షకూర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి



మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మణికొండ: పైప్‌లైన్‌ను ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్న పనులను వెంటనే అడ్డుకోవాలని బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు ముక్తార్‌పాషా ఆధ్వర్యంలో వార్డు ప్రజలు నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని గురువారం కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముక్తార్ పాషా మాట్లాడుతూ వార్డు నంబర్ 8, రోడ్డు నంబర్ 11లో ఓ ఇంటి యజమాని ఏకంగా జలమండలి నీటి పైప్‌లైన్ పైనే నిర్మాణం చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో పైప్‌లైన్ రిపేరు, నీటి కలుషితం ఏర్పడితే సమస్య జటిలం అవుతుందని కమిషనర్‌కు వివరించామన్నారు.

నీటి సరఫరాను పెంచండి..

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయడంలో జలమండలి అధికారులు విఫలం అవుతున్నారని, ఇకనైనా సరఫరాను పెంచాలని బీఆర్‌ఎస్ నాయకుడు ముక్తార్ పాషా కోరారు. ఈ మేరకు జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డిని గురువారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో నిర్మించిన రిజర్వాయర్ల నుంచి గ్రామ ప్రజలకే కాకుండా చుట్టుపక్కలా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకే అధికంగా నీటి సరఫరా చేస్తున్నారన్నారు. పరిస్థితిని చక్కదిద్దకపోతే జలమండలి కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ యాదయ్య కుటుంబానికి చేయూత



- విరాళాలు సేకరించిన తోటి సిబ్బంది, బ్యాచ్‌మేట్స్
- రూ.15 లక్షల విలువైన ఫ్లాట్ కొనుగోలు
- సైబరాబాద్ సీపీ చేతుల మీదుగా ఫ్లాట్ పత్రాలు అందజేత

సాక్షి, సిటీబ్యూరో: గుండెపోటుతో మృతి చెందిన మాదాపూర్ ఠాణా కానిస్టేబుల్ యాదయ్య కుటుంబానికి సహోద్యోగులతో పాటు బ్యాచ్‌మేట్స్ అండగా నిలిచారు. విరాళంగా సేకరించిన డబ్బులతో 200 గజాల ఫ్లాట్ కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన పత్రాలను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి చేతుల మీదుగా యాదయ్య కుటుంబీకులకు గురువారం అందించారు. పర్మగల్ల యాదయ్య 2007లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై సైబరాబాద్‌లో విధులు నిర్వర్తించారు. 2011లో సివిల్ కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయ్యారు. మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న యాదయ్య గతేడాది ఆగస్టు 8న గుండెపోటుతో కన్నుమూశారు. ఈయనకు భార్య పూజ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే యాదయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని భావించిన మాదాపూర్ స్టేషన్ సిబ్బంది, 2011 బ్యాచ్ కానిస్టేబుళ్లు రూ.15 లక్షలను విరాళంగా సేకరించారు. దీంతో శంషాబాద్ దగ్గరలోని పెద్ద షాపూర్‌లో యాదయ్య పిల్లల పేరుతో 200 గజాల ఫ్లాట్‌ను ఖరీదు చేసి అందించారు. కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ డాక్టర్ జి.వినీత్, ఇన్‌స్పెక్టర్ జి.మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన సీపీఎం నేతలు



శంషాబాద్: శంషాబాద్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రావును మండల సీపీఎం నేతలు గురువారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మండల కన్వీనర్ నీరటి మల్లేశ్, సభ్యులు ఎర్ర వెంకటేశ్, ఏపూరి పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

కార్మికుడిపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి



కార్మికుడిని పరామర్శిస్తున్న నాయకులు, కార్మికులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ 12వ వార్డులో కార్మికుడిని కొట్టిన అదే గ్రామానికి చెందిన మోసిన్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ డిమాండ్ చేశారు. నాయకులు, కార్మికులతో కలిసి గురువారం కార్మికుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో బుధవారం విధులు నిర్వర్తిస్తున్న ఎం. నగేశ్ అనే కార్మికుడు చెత్త ఊడుస్తుండగా దుమ్ము తనపైకి వస్తుందనే కారణంతో మోసిన్ కార్మికుడిపై దాడి చేశారన్నారు. దీంతో తీవ్ర గాయాలు కాగా స్థానిక కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చేర్పి చికిత్స చేయించారన్నారు. దాడి చేసిన వ్యక్తిపై నార్సింగి పోలీసులు, నార్సింగి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అశోక్, తోటి మున్సిపల్ కార్మికులు, శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే తోటి కార్మికుడిపై దాడి చేయడంతో వారంతా పారిశుధ్య పనులు నిలిపివేశారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న సీతారాం దంపతులు

మణికొండ: పేద విద్యార్థులను ఆదుకోవాలని మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి. సీతారాం అన్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 206 మంది విద్యార్థులు సాయంత్రం ఆకలితో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్నారు. దీంతో ఆయన వివాహ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు గురువారం అల్పాహారం అందించారు. కార్యక్రమంలో వీఆర్‌ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎ. లక్ష్మణ్‌రావు, నాయకులు నిర్మల్ చంద్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శివరామకృష్ణ, గోల్డెన్ ఓరియోల్ అపార్ట్‌మెంట్ నివాసితుల నాగరికుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మూసీ కబ్జాలను అరికట్టండి



మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న మంచిరేవుల గ్రామస్తులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామ సమీపంలోని మూసీ నది పక్కన ఓ నిర్మాణ సంస్థ మట్టి, రాళ్లు వేసి కబ్జాకు పాల్పడుతుందని, వెంటనే అరికట్టాలని నార్సింగి వాసులు మున్సిపల్ కమిషనర్ టి. పవన్‌కుమార్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు సాయికుమార్ మాట్లాడుతూ రాజపుష్ప ప్రాపర్టీస్ వారు రాత్రి సమయంలో మూసీ నదిలో పెద్ద ఎత్తున మట్టి, రాళ్లను నింపుతున్నారన్నారు. ఇప్పటికే అనేక చోట్ల ఆక్రమణలకు గురై నీరు సరిగా రావడంలేదని, ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లోనూ కనిపించకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రవీణ్, ప్రేమ్‌కుమార్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి



మధుయాష్కీతో సమావేశమైన మణికొండ నాయకులు

మణికొండ: రాబోయే ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచేలా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సూచించారు. మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్ ఆధ్వర్యంలో గురువారం గాంధీ భవన్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన కార్యాచరణ ప్రణాళికల గురించి ఆయన పలు సూచనలు చేసినట్టు పార్టీ అధ్యక్షుడు జితేందర్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, మణికొండ మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ హాజీ, కౌన్సిలర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

'ఇమ్యునో అంకాలజీ' పై సదస్సు

రాయదుర్గం: ఇమ్యునోథెరపీ అపోహలను తొలగించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రముఖ కేన్సర్ పరిశోధకులు డాక్టర్ కీత్‌ఫ్లాహెర్టీ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో కేన్సర్ అవేర్‌నెస్ నెలలో భాగంగా ఇమ్యునో ఆంకాలజీలో అడ్వాన్సెస్‌పై ఇంటరాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేన్సర్ చికిత్సలో అనేక మార్పులు వచ్చాయని, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. జన్యు ఆధారిత చికిత్సల అభివృద్ధి, చికిత్స నిరోధకతను పరిష్కరించడానికి వ్యూహాలు, వ్యక్తిగతీకరించిన చికిత్సను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించాయన్నారు. పరిశోధకులు డాక్టర్ రమీ ఇబ్రహీమ్ మాట్లాడుతూ ఊపిరితిత్తుల కేన్సర్, మూత్రాశయ, మెదడు, బ్రెస్ట్ కేన్సర్ల చికిత్సా పురోగతిని వివరించారు. కాంటినెంటల్ ఆస్పత్రి సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ సురేష్ మాట్లాడుతూ వ్యక్తిగత ఇమ్యునోథెరపీ, టార్గెట్ ఇమ్యునోథెరపీపై పలు అధ్యయనాలను వివరించారు. ఇన్ఫర్మేటివ్ సెషన్ కార్యక్రమంలో కాంటినెంటల్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ సురేష్, ఇతర డాక్టర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను కలిసిన ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

మణికొండ: ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డి. సీతారాం, ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, అధిక ఇంటి పన్నులు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు అరికట్టాలన్నారు. తమ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం త్వరలో నిర్వహిస్తామని, దానికి హాజరై సమస్యలు తెలుసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి బాబురావు, నాయకులు రామయ్య పాల్గొన్నారు.

లైంగికదాడి, హత్యకేసులో యావజ్జీవ శిక్ష

రాజేంద్రనగర్: మైనర్ బాలుడిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడికి రాజేంద్రనగర్ పోక్సో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టెపల్లికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ (35) ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. 2016లో స్థానికంగా ఆడుకుంటున్న మైనర్ (8)ని తన బైక్‌పై నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడి హత్య చేసి కాలువలో పడేసి వెళ్లిపోయాడు. బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా కాలువ వద్ద మృతదేహం లభించింది. దీంతో పోలీసులు క్లూస్ టీంను రప్పించి పూర్తి ఆధారాలు సేకరించి మహ్మద్ ఇర్ఫాన్‌ను నిందితుడిగా తేల్చారు. ఇర్ఫాన్‌కు అతని సోదరుడు సహకరించినట్లు విచారణలో తేలింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇర్ఫాన్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ జడ్జి తుది తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితుడికి సహకరించిన సోదరుడు రిమాండ్‌కు వెళ్లిన అనంతరం బెయిల్‌పై బయటకి వచ్చి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కొండాపూర్ బెటాలియన్‌లో క్వార్టర్స్ నిర్మాణానికి శంకుస్థాపన

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో అధికారులు, సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మాణానికి టీఎస్‌ఎస్‌పీ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా శంకుస్థాపన చేశారు. గురువారం తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి ఎం.రమేష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.13 కోట్ల వ్యయంతో అధికారులు, సిబ్బంది కోసం 19 క్వార్టర్స్ నిర్మించనున్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌పీ డీఐజీ ఎం.ఎస్.సిద్ధిఖీ, చీఫ్ ఇంజనీర్ కె.సుబ్రహ్మణ్యం, తులసీధర్, ఈఈ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వృద్ధురాలి మృతి



బాలమ్మ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: టిఫిన్ సెంటర్ వద్ద అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. మహబుబ్‌నగర్‌లోని నవాబ్‌పేట్‌కు చెందిన బాలమ్మ (65) కొన్ని రోజుల క్రితం కాటేదాన్‌లో తన చిన్న కూతురి దగ్గరకు వచ్చింది. బుధవారం సాయంత్రం రేషన్ షాపునకు వెళ్లి వస్తానని కూతురికి చెప్పి వెళ్లింది. రాత్రి అయిన వెళ్లలేదు. బాలమ్మకు కల్లు తాగే అలవాటు ఉందని, కొంత కల్లు తాగినట్లు స్థానికుల పేర్కొన్నారు. ఉదయం కాటేదాన్‌లోని ఓ టిఫిన్ సెంటర్ ఎదుట మృతి చెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

ప్రతికూల వాతావరణంతో ప్రయాణికుల పాట్లు

శంషాబాద్ : ప్రతికూల వాతావరణంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి గురువారం ఉదయం 7 గంటలకు ఇండిగో 6ఈ 7201 విమానం విజయవాడకు బయలుదేరింది. అక్కడ పొగ మంచు అధికంగా ఉండడంతో విమానం దిగేందుకు ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్) అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించడంతో తిరిగి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. ఇందులో 174 మంది ప్రయాణికులు ఉన్నట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. మధ్యాహ్నం తర్వాత ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

రాజేంద్రనగర్: డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు శిక్ష పడినట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఏడుగురిపై కేసు నమోదు చేసి గురువారం ఉదయం రాజేంద్రనగర్‌లోని మూడో ఎంఎం స్పెషల్ న్యాయమూర్తి ఎదుటు హాజరుపర్చామన్నారు. దీంతో జడ్జి ముగ్గురికి జరిమానాతో పాటు జైలు, మిగిలిన నలుగురికి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఆయన పేర్కొన్నారు. మద్యం తాగి నడపవద్దని, అలాగే మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే యజమానిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బంజారా నాయకులు



ఎయిర్‌పోర్టుకాలనీలో ర్యాలీ తీస్తున్న దృశ్యం



జయంతి వేడుకల్లో పాల్గొన్న యూత్ సభ్యులు

రాజేంద్రనగర్: బంజారాల ఆరాధ్యదైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతినిని గురువారం శ్రీకృష్ణ కాలనీ, న్యూ గ్రీన్ సిటీ, బుద్వేల్‌లోని బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగ్ భండార్, అన్నదానం, బైక్ ర్యాలీ, సేవాలాల్ మహారాజ్ శోభాయాత్ర బంజారా నృత్యాలు నిర్వహించారు. శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్, జాగృతి కన్వీనర్ ఆర్.శ్రావణ్, నరేశ్ యాదవ్, సన్నీరాజ్, బంజారా నాయకులు వి.శ్రీహరి నాయక్, ప్రెసిడెంట్ ఎం.లక్ష్మణ్ నాయక్, ఉపాధ్యక్షుడు ఎస్.గణేశ్, ప్రధాన కార్యదర్శి తేజావత్ శ్రీనివాస్ నాయక్, గౌరవ అధ్యక్షుడు జె.రాజు నాయక్, కోశాధికారి జె.రవీందర్ నాయక్, సలహాదారులు తార్యా నాయక్, ఉద్యోగులు, బంజారా నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాబుల్‌రెడ్డి నగర్‌లో..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్‌లో స్థానిక యూత్ క్లబ్ సభ్యులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవాలాల్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్ రెడ్డి, గోపాల్ నాయక్, కిషన్ నాయక్ , సంతుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు కాలనీలో..

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీలో అంగూర్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ తీసి అన్నదానం చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ హైదర్‌గూడ ఈశ్వర్ థియేటర్ పిల్లర్ నంబర్ 133 వద్ద సాయంత్రం 35–40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

'నీ చూపు చెప్పింది నాకు' పుస్తకావిష్కరణ



మాదాపూర్: వర్ధమాన రచయిత కొరటమద్ది హేమంత్ తొలి నవల 'నీచూపు చెప్పింది నాకు' పుస్తకాన్ని ప్రముఖ నటులు,రచయిత,దర్శకులు తనికెళ్ల భరణి ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని ఫినిక్స్ ఎరీనాలోనిర్వహించిన కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఆదిత్య, రచయిత ,నటులు అవసరాల శ్రీనివాస్ ,నిర్మాత వంశీ చాగంటి పాల్గొన్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి సోదరుడు శ్రీరామశాస్త్రి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. తొలి ప్రయత్నంలోనే విశ్లేషణాత్మకంగా రచించిన హేమంత్‌ను అభినందించారు.తనును ఆది నుంచి ప్రోత్సహించిన భరణి, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర తదితరులకు హేమంత్ ధన్యవాదాలు తెలిపారు.